సివరేజీ పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు


జలమండలి అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో నాలా వరకు నూతన సివరేజీ పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదించినట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. మంగళవారం ఆయన జలమండలి జీఎం శ్యాంనాయక్‌తోపాటు ట్రాన్స్‌కో అధికారులతో మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి లాలాజర్ హోటల్ చౌరస్తా వరకు పర్యటించి సివరేజీ సమస్యను చర్చించారు. మలక్‌పేట టీబీ కేన్సర్ ఆస్పత్రి నుంచి నల్గొండ చౌరస్తా మీదుగా ఇటు ఆజంపుర నుంచి వచ్చే మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నూతన సివరేజీ పైప్‌లైన్‌ను జాతీయ రహదారికి అడ్డుగా నిర్మించేందుకు ప్రతిపాదించారు. ఇందుకు రూ.2.50కోట్ల వరకు వ్యయమవుతుందని జలమండలి అధికారులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో ట్రాన్స్‌కోకు సంబంధించిన అండర్‌గ్రౌండ్ కేబుల్‌కు కూడా అంతరాయం కలుగకుండా నూతన సివరేజీ పైప్‌లైన్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే జలమండలి అధికారులకు సూచించారు.


బాలాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సరూర్‌నగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ 17వ డివిజన్ ఓల్డ్ విలేజ్‌లో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈఈ సాయిరామ్, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, శివాలయం కమిటీ చైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి, నాయకులు బాల్‌నింగని జంగయ్య, కొలన్ కృష్ణారెడ్డి, వంగేటి కొండల్‌రెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, టేకుల సుధాకర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్, రాఘవరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.


మీర్‌పేట్‌లో చెరువుల ఆక్రమణలను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

మీర్‌పేట్‌లో హైడ్రా అధికారుల పర్యటన

సరూర్‌నగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ కబ్జాకు గురయ్యాయంటూ ఇటీవల హైడ్రా కమిషనర్‌కు కొందరు కార్పొరేటర్లు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం సంబంధిత అధికారులు మీర్‌పేట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడి చందచెరువు, మంత్రాలచెరువు, పెద్దచెరువులను సందర్శించి మ్యాప్‌లు, శాటిలైట్ చిత్రాల ఆధారంగా వాటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను పరిశీలించారు. హైడ్రాకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్లు వారికి చెరువుల ఆక్రమణలను చూపించారు. కాగా తాము పరిశీలించిన వివరాలతో హైడ్రా కమిషనర్‌కు నివేదిక అందజేస్తామని, ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

మీర్‌పేట్‌లోని చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణపై మంగళవారం పలువురు కార్పొరేటర్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయా కబ్జాలను తొలగించి చెరువులను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు.

జడ్జి శ్రీదేవిని కలిసిన గోపీశంకర్‌యాదవ్


జడ్జి శ్రీదేవితో గోపీశంకర్‌యాదవ్

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పీ.శ్రీదేవిని మంగళవారం సురక్ష సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కుర గోపీశంకర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సురక్ష సంఘం, న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామాజిక, న్యాయ చైతన్య అవగాహన కార్యక్రమాలపై చర్చించారు. త్వరలోనే అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

పోచమ్మ గుడిలో ఘనంగా కుంకుమార్చన


శ్రావణమాస పూజలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీవాసులు

వనస్థలిపురం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌లోని ప్రసిద్ధ శ్రీపోచమ్మతల్లి ఆలయంలో చివరి శ్రావణ మంగళవారం సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన పూజలు కనులపండువగా జరిగాయి. మాజీ కార్పొరేటర్, ఆలయ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు గణేష్‌యాదవ్, ఎన్. కృష్ణ, రాజేందర్, శంకరయ్య, ఉపేందర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించండి


వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ ఆశవర్కర్ల యూనియన్ ప్రతినిధులు

సైదాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘం ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఏఎన్‌సీ టార్గెట్ తీసివేయాలని పేర్కొన్నారు. పనిభారంతో తెలంగాణలో ఆశవర్కర్లు అనారోగ్యానికి గురై మృతి చెందారని, వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నరేందర్ రెడ్డి సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు యూనియన్ గౌరవ అధ్యక్షుడు కూర వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు షైముద, ఉపాధ్యక్షురాలు ధర్నా శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి రజిత, పిట్ట శ్రీలత, మంజుల, రాజమణి, కవిత పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాపై చర్యలు తీసుకోండి

హైడ్రా కమిషనర్‌కు వినతి

కొత్తపేట: కొత్తపేట ప్రభుత్వ స్థలాల కబ్జాలపైనా చర్యలు తీసుకోండి అని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. మంగళవారం కార్పొరేటర్ కమిషనర్‌ను కలిసి అన్యాక్రాంతమైన స్థలాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఉపక్షాల్ మండల పరిధి కొత్తపేట ఎస్ఆర్ఎల్ కాలనీ సమీపంలో సర్వే నెం.143, 146, 159, 160లలో 3 ఎకరాల 12 గుంటల స్థలం ఉండేదని స్థలం అన్యాక్రాంతం కాగా ప్రస్తుతం 19 గుంటల స్థలం ఉందన్నారు. అందులో తెలంగాణ పార్కు అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. అన్యాక్రాంతం అయిన స్థలాన్ని కాపాడాలని కమిషనర్‌కు విన్నవించారు. మూసీ పరీవాహిక బఫర్ జోన్ ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు వెలిశాయని కమిషనర్‌కు తెలిపారు. కొత్తపేట డివిజన్‌లోని ప్రభుత్వ స్థలాల అన్యాక్రాంతంపై సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీ నుంచి మహారాష్ట్రకు.. వయా హైదరాబాద్

- గంజాయి సరఫరా చేస్తున్న ముఠా
- ఆటకట్టించిన రాచకొండ పోలీసులు
- ఇద్దరు అంతరరాష్ట్ర స్మగ్లర్స్ అరెస్టు
- 60 కేజీల గంజాయి, కారు స్వాధీనం
- మొత్తం సొత్తు విలువ రూ. 35లక్షలు


రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి మహారాష్ట్రకు వయా హైదరాబాద్ మీదుగా గంజాయిని సరఫరా చేస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్స్‌ను రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 60 కేజీల గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్‌తో కలిసి సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన వాల్మీక్ రూపా మోహితే అలియాస్ వాల్మీక్ తనకున్న మినీ లారీతో ఇతర ప్రాంతాలకు సామగ్రి తరలించే రవాణా వ్యాపారం చేస్తుండేవాడు. అతడి బంధువు భటుదేవరం చవాన్ అలియాస్ భటు వాల్మీక్ వద్ద సహాయకుడిగా చేరాడు. భటుకు గంజాయి అలవాటుంది. ఆరు నెలల క్రితం వాల్మీక్ భటులు ఉల్లిగడ్డ లోడ్‌తో విశాఖపట్నం వెళ్లారు. అక్కడ తిరుపతి అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న భటు అతని వద్ద గంజాయి కొనుగోలు చేసి సేవించాడు. గంజాయి గురించి, దాన్ని రవాణా చేస్తే వచ్చే లాభాల గురించి చర్చించేవాడు.

రవాణా వ్యాపారంలో నష్టాలు రావడంతో..

కొద్దిరోజులుగా రవాణా వ్యాపారంలో నష్టాలు రావడంతో.. వాల్మీక్‌కు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో గంజాయి రవాణా చేస్తే అధిక లాభాలు వస్తాయని తిరుపతితో మాట్లాడితే మంచి ఆఫర్స్ వస్తాయని భటు వాల్మీక్‌తో అన్నాడు. ఇదే మంచి అవకాశం అనుకున్న వాల్మీక్. తిరుపతితో మాట్లాడిన తర్వాత తన మినీ లారీని అమ్మేసి స్విఫ్ట్ కారు కొన్నాడు. ఆ తర్వాత తిరుపతి సహకారంతో గత కొంతకాలంగా ఏపీ నుంచి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 25న భటు, వాల్మీక్‌లు కారులో పెందుర్తి వెళ్లారు. అక్కడ తిరుపతి సహకారంతో 60 కేజీల గంజాయిని సేకరించారు. 2 కేజీల చొప్పున ప్యాకింగ్ చేసి మొత్తం 30 ప్యాకెట్లను కారులో లోడ్ చేసుకున్నారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి నకిలీ నంబర్ ప్లేట్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి బయలు దే ఓఆర్ఆర్ మీదుగా మహారాష్ట్ర వెళ్లేందుకు బయలుదేరారు. అప్పటికే గంజాయి రవాణాపై సమాచారం అందుకున్న రాచకొండ మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు ఇబ్రహీంపట్నంలో స్థానిక పోలీసులతో కలిసి పట్టుకున్నారు. కారులో తరలిస్తున్న 60 కేజీల గంజాయి పట్టుకున్నామని, మొత్తం విలువ రూ. 35 లక్షలు ఉంటుందని సీపీ తెలిపారు. గంజాయి సరఫరాదారుడు తిరుపతిని త్వరలోనే అరెస్టు చేస్తామని సీపీ వెల్లడించారు.

మహేశ్వరంలో రాజ్యాంగేతర శక్తిగా మారిన కేఎల్లార్

- అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ వేధింపులు
- బీజేపీ రాష్ట్ర నేత శంకర్‌రెడ్డి ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి రాజ్యాంగేతర శక్తిగా మారి అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆరోపించారు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొం టూ.. అధికారులు తాను చెప్పినట్లు వినాలని ఆదేశాలు జారీ చేస్తూ వారిని వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లెలగూడలో పార్టీ మీర్‌పేట్ శాఖ ప్రధాన కార్యదర్శులు కె.సోమేశ్వర్, గాజుల మధు, పార్టీ నాయకుడు శ్యాంరాజ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్న అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో కేఎల్లార్ తలదూరుస్తున్నారని, అధికారులను తన కనుసన్నల్లో పెట్టుకుని ప్రతిపక్షాల మాట వినొద్దంటూ వారిని బెదిరిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ పని జరగాలన్నా తనకు సమాచారం ఇవ్వాలని, తనకు చెప్పకుండా ఏమీ చేయొద్దని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని శంకర్‌రెడ్డి విమర్శించారు. కొందరు అధికారులు సైతం కేఎల్లార్‌కు వంత పాడుతున్నారని, అలాంటి వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన అన్నారు. అధికారులు ఎవరి ఒత్తిడిలకు లొంగకుండా చట్ట ప్రకారం విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు.

పేదల జోలికొస్తే హైడ్రాను అడ్డుకుంటాం

రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో డబుల్ గేమ్ ఆడుతున్నదని, కూల్చివేతల నెపంతో పేదల నివాస గృహాల జోలికొస్తే హైడ్రాను అడ్డుకుని తీరుతామని శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రాకుగానీ, రాష్ట్ర ప్రభుత్వానికిగానీ నిజంగా దమ్మూ, ధైర్యం ఉంటే ఎంఐఎం నేతలు చెరువుల్లో కట్టిన నిర్మాణాలను కూల్చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం.. దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే హైడ్రా పేరుతో హడావుడి చేస్తున్నదని శంకర్‌రెడ్డి ఆరోపించారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి

చంపాపేట: హస్తినాపురం డివిజన్ భూపేష్ గుప్తానగర్‌కాలనీలోని నల్లపోచమ్మ ఆలయం ఆవరణలో సోమవారం రాత్రి ఆలయ చైర్మన్, కాలనీ అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నారి బాలబాలికలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దండే వినయ్‌శాస్త్రి, వండే అనిల్‌శాస్త్రి, యాదవసంఘం పెద్దలు గూదే గాలయ్య యాదవ్, మల్లయ్యయాదవ్, శంకర్, మల్లేష్‌గౌడ్, శ్రీధర్, శివకుమార్‌యాదవ్, రమేష్‌యాదవ్, భరత్‌గౌడ్, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమశాఖ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా క్రాంతివెస్లీ

ఓల్డ్ మలక్‌పేట, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా క్రాంతివెస్లీ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. డైరెక్టర్ బీ. శైలజ సెలవుపై వెళ్లడంతో ఉమెన్స్ చైల్డ్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వెస్లీని రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ ఇన్‌చార్జిగా నియమించారు.


ఆర్‌కేపురం బీఆర్ఎస్ కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, నగేష్ తదితరులు

కవితకు బెయిల్‌పై బీఆర్ఎస్ సంబరాలు

ఎల్బీనగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్‌ను భయపెట్టలేరని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. మంగళవారం కవితకు బెయిల్ రావడంతో ఆర్‌కేపురంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్కర్ కేసు కుట్రపూరితమైనదని మొదటి నుంచే కేసీఆర్ అంటున్నారని ఇది కేంద్రం ఆడుతున్న నాటకమే తప్పితే మరేమి లేదన్నారు. సుప్రీంకోర్టులో జరిగిన వాదోపవాదాలు చూస్తే కేసీఆర్ అన్నట్లే కవిత కడిగిన ముత్యంలా బయటకు వచ్చిందన్నారు. మహిళ అనే కనికరం లేకుండా ఆమె ఆరోగ్యం గురించి కూడా ఆలోచించకుండా అయిదు నేలలుగా కవిత ను ఇబ్బందుల పాలు చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, సాజిద్, శ్యాంగుప్తా, మహేందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, జగన్, దీపక్, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి


మృతి చెందిన నాగేందర్‌రెడ్డి

జీడిమెట్ల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై విధులకు వెళ్తున్న ఇద్దరు యువకులను వెనుక నుంచి అతివేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడు తీవ్రగాయాల పాలై మృ తి చెందాడు. మరో యువకుడు గాయపడడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జీడిమెట్ల సీఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాల్‌పల్లి, రాయగొండ మండలం, రామగుండాలపల్లికి చెందిన జయేందర్‌రెడ్డి కుటుంబం చింతల్ మాణిక్యనగర్‌లో నివాసముంటోంది. అతడి కుమారుడు ముల్లగుండ్ల నాగేందర్‌రెడ్డి (31) జీడిమెట్ల దూలపల్లి ప్రాంతంలోని అరుణోదయా ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో నాగేందర్‌రెడ్డి, అతని చిన్నమ్మ కుమారుడు జితేందర్‌రెడ్డి కలిసి స్కూటీపై విధులకు హాజరు కావడానికి దూలపల్లికి వెళ్తున్నాడు. సుభాష్‌నగర్ సాయికాంటా వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన వాహనం వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం నాగేందర్‌రెడ్డిపై నుంచి వెళ్లింది. వెనుక కూర్చున్న జితేందర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వీరిద్దని ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే నాగేందర్‌రెడ్డి మృతి చెందాడు. జితేందర్‌రెడ్డి చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.



కార్యక్రమంలో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

సెప్టెంబర్ 26 నుంచి ఇన్వెస్టర్ కనెక్ట్ వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ : ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ స్టార్టప్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎస్ఎన్)తో కలిసి అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్ (ఐఎస్ఎఫ్) 2024ను హైదరాబాద్‌లో తొలిసారి నిర్వహించేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో దీనిని నిర్వహించనున్నారు. ఐఎస్ఎఫ్ 2024 కోసం ఇన్వెస్టర్ కనెక్ట్ వర్క్‌షాప్, కర్టెన్ రైజర్ కార్యక్రమం మంగళవారం టీ-హబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎస్ఎఫ్ ఫౌండర్ జేపీ చౌదరి, ఐఎస్ఎఫ్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ శివమహేష్ టంగుటూరు, ఫిక్కీ ఫ్లో చైర్‌పర్సన్ ప్రియాగజ్జర్ పాల్గొన్నారు. ఐఎస్ఎఫ్ 2024ను 'ఏఐ యుగంలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత' నేపథ్యంతో హెల్త్ కేర్, ఎడ్యుకేషన్, అగ్రిటెక్, ఫుడ్ టెక్నాలజీ, ఫిన్‌టెక్, రూరల్ ఇన్నోవేషన్స్‌తో సహా వివిధ రంగాలలో ఆవిష్కరణలను చేయడానికి కృత్రిమ మేధస్సుపై దృష్టి సారించి నిర్వహించనున్నామని జేపీ చౌదరి అన్నారు. ఐఎస్ఎఫ్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ శివ మహేష్ టంగుటూరు మాట్లాడుతూ 'ఐఎస్ఎఫ్ 2024లో ఇండియా, యూఎస్ఏ తదితర దేశాల నుంచి స్టార్టప్‌లు పాల్గొంటాయని తెలిపారు.

ఆటోలో నుంచి పడిపోయిన బంగారు ఆభరణాల బ్యాగు

- సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా స్వాధీనం
- తిరిగి బాధితురాలికి అప్పగించిన మీర్‌పేట్ పోలీసులు


బాధితురాలు వనజ పోగొట్టుకున్న నగలను స్వాధీనం చేసుకుని తిరిగి ఆమెకు అప్పగిస్తున్న పోలీసులు

సరూర్‌నగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి పడిపోయిన బంగారు ఆభరణాల బ్యాగును సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా స్వాధీనం చేసుకుని తిరిగి బాధితురాలికి అప్పగించారు మీర్‌పేట్ పోలీసులు. వివరాలిలా ఉన్నాయి.. జిల్లెలగూడ గాయత్రీనగర్‌కు చెందిన మద్ది వనజ సోమవారం మధ్యాహ్నం తన కూతురు ముత్యాల లక్ష్మితో కలిసి వ్యక్తిగత పని మీద సరూర్‌నగర్‌లోని శారదానగర్‌కు వెళ్లారు. సాయంత్రం ఓ ఆటో మాట్లాడుకుని తిరిగి గాయత్రీనగర్‌కు బయలుదేరారు. తీరా ఇంటి వద్ద ఆటో దిగి ఇంట్లోకి వెళ్లిన తర్వాత చూసుకోగా.. దాదాపు 25తులాల బంగారు ఆభరణాలు గల బ్యాగు కనిపించలేదు. వెంటనే వారు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఇన్‌స్పెక్టర్ కీసరి నాగరాజు నేతృత్వంలోని బృందం రంగంలోకి దిగి గాయత్రీనగర్ నుంచి శారదానగర్ వరకు గల సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. కాగా ఆటోలోని నగల బ్యాగు కర్మన్‌ఘాట్‌లోని క్రాంతినగర్ గ్రౌండ్ వద్ద ఆటో నుంచి కింద పడగా, వెనకాల వస్తున్న మరో ఆటో డ్రైవర్ సదరు బ్యాగును తీసుకుని వెళ్లినట్టు సీసీ టీవీలో కనిపించింది. ఆ ఆటో నంబర్ ఆధారంగా పేరు, చిరునామా కనుక్కున్న పోలీసులు అక్కడకు వెళ్లి బంగారు నగల బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న నగలను తనిఖీ చేయగా అన్నీ సరిగా ఉన్నట్టు తేలింది. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు వనజను పీఎస్‌కు పిలిచి సదరు బంగారు ఆభరణాల బ్యాగును అప్పగించారు. కాగా తాము ఫిర్యాదు చేయగానే స్పందించి నగల బ్యాగును స్వాధీనం చేసుకుని తిరిగి అప్పగించిన పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికులు ఆటోల్లో గానీ, క్యాబ్‌ల్లో గానీ ప్రయాణించేటప్పుడు తమ వస్తువుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, దిగేటప్పుడు అన్నీ సరిచూసుకోవాలని ఇన్‌స్పెక్టర్ నాగరాజు సూచించారు.


సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పంజాల అనిల్‌కుమార్ కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన ఉత్సవాలలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, రిషి తదితరులు పాల్గొన్నారు.
- ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి


చెరువుల ఆక్రమణలను కూల్చివేస్తూ సంచలనం సృష్టిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి పేద, మధ్యతరగతి కుటుంబాల జోలికి రావద్దని కోరిన జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డికి లింగోజిగూడ డివిజన్ పరిధిలోని తపోవన్‌కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం వార్డు కార్యాలయంలో రాజశేఖర్‌రెడ్డిని కలిసిన ప్రతినిధులు మాట్లాడుతూ తపోవన్ కాలనీ, గ్రీన్‌పార్క్‌కాలనీ, సింగరేణికాలనీలలో నివసించే వారంతా పేద, మధ్యతరగతి వారని చెప్పారు. తమకు అండగా నిలిచిన రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పామన్నారు. తపోవన్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధు, మాజీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, ఐలయ్య, ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యక్షులు మహేష్, నర్సింగరావు, పాపయ్య, చంద్రయ్య, రాజు, కృష్ణ పాల్గొన్నారు.
- ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి

మలక్‌పేట సర్కిల్ 6 ఏసీపీగా గజానంద్

ఓల్డ్ మలక్‌పేట, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట జీహెచ్ఎంసీ సర్కిల్ 6 అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ (ఏసీపీ)గా గజానంద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్బీనగర్ సర్కిల్ 3 కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు మలక్‌పేట ఏసీపీగా పనిచేసిన ఎర్షాద్ వరంగల్‌కు బదిలీ అయ్యారు.

బ్యాంక్ ఖాతా నుంచి పోగొట్టుకొన్న డబ్బులు రికవరీ



రికవరీ చేసిన డబ్బును అభిషేక్‌కు అందజేస్తున్న సీఐ సందీప్‌కుమార్

నేరేడ్‌మెట్, ఆగస్టు 27, (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు పోగొట్టుకొన్న బాధితుడికి నేరేడ్‌మెట్ పోలీసులు రికవరీ చేసి ఆ డబ్బులు అందజేశారు. నేరేడ్‌మెట్ సీఐ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అభిషేక్ అనే వ్యక్తి మూడు నెలల క్రితం సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌లో తన వివరాలను నమోదు చేశాడు. సైబర్ నేరగాళ్లు ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే డబ్బులు వస్తాయని వారు అభిషేక్‌ను నమ్మించారు. వారు చెప్పిన విధంగా కొద్ది కొద్దిగా డబ్బులు పంపుతూ మొత్తం లక్షా ఇరవై ఆరు వేల 752 రూపాయలు వారికి తన ఖాతా ద్వారా పంపాడు. అయినా అభిషేక్‌కు డబ్బులు రాకపోవడంతో మోసపోయానని తెలుసుకొని వెంటనే 1930కి ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుల బ్యాంక్ ఖాతాలను నిలుపుదల చేశారు. రెండు నెలలు తరువాత అభిషేక్ డబ్బులు రికవరీ చేసి మంగళవారం అందజేశారు. తిరిగి డబ్బులు ఇప్పించిన నేరేడ్‌మెట్ పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సందీప్‌కుమార్ మాట్లాడుతూ, సైబర్ నేరాల బారిన పడినవారు వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు.

ఉరేసుకుని వాచ్‌మ్యాన్ ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న నబీపాష

హయత్‌నగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించి అనారోగ్యం పాలైన వాచ్‌మ్యాన్ ఆ బాధను భరించలేక మంగళవారం ఉదయం రేకుల షెడ్డులో ఇనుపరాడ్డుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లికి చెందిన షేక్ నబీపాష(34) కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఅంబర్‌పేట్‌కు వలస వచ్చాడు. అంబర్‌పేట్ నుంచి బలిజగూడకు వెళ్లే రోడ్డులో ఉన్న జేసీబీల మెకానిక్ షెడ్డులో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా షేక్ నబీపాష మద్యానికి బానిసైనాడు. దీంతో అతని ఆరోగ్యం క్షీణించింది. బాధ భరించలేక మంగళవారం ఉదయం నివాసానికి ఎదురుగా ఉండే మరో షెడ్డులో ఇనుపరాడ్డుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి అమ్ముతున్న ముగ్గురు యువకుల అరెస్ట్

- 265 గ్రాముల గంజాయి స్వాధీనం

సైదాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను మాదన్నపేట పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 265 గ్రాముల గంజాయి, రూ.3800 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చంచల్‌గూడ జైలు ఎదుట శ్మశానవాటిక సమీపంలో 18-20 సంవత్సరాల మధ్య వయస్సు గల ముగ్గురు యువకులు గంజాయి అమ్ముతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేశారు. నిందితులు ఆసీఫ్, ఆదిల్, రెహమాన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయి, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆనంద్ అగర్వాల్ అనే వ్యాపారి వద్ద నుంచి రూ.4వేలకు 265 గ్రాముల గంజాయి కొనుగోలు చేశామని నిందితులు తెలిపారు. దానిని అధిక ధరలకు వినియోగదారులకు అందిస్తున్నామని విచారణలో వెల్లడించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.